నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I హైదరాబాద్, శనివారం 17 మే 2025 VIKARABAD


## 810 గ్రాముల గంజాయి చాక్లెట్లు స్వాధీనం

ఆదిబట్ల, మే 16 : గంజాయి చాక్లెట్లను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆదిబట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదిబట్ల ఎస్ఐ సుధాకర్‌రెడ్డి కథనం ప్రకారం..రాజస్థాన్‌కు చెందిన షర్వాన్‌కుమార్ తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడలో పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. అతడు గత నాలుగు నెలలుగా రాజస్థాన్ నుంచి గంజాయి చాక్లెట్లను తీసుకొచ్చి పాన్ షాపులో నిల్వ చేసి.. కూలీలకు విక్రయించడం మొదలెట్టాడు. ఇలా గంజాయి చాక్లె ట్లు అమ్ముతుండగా టీసీఎస్‌లో హౌస్‌కీపింగ్ పని చేసే ఒడిశా రాష్ట్రానికి చెందిన అజిత్ సర్దార్‌తో పరిచయం ఏర్పడింది. ఇరువురు కలిసి రాజస్థాన్ నుంచి గంజాయి చాక్లెట్లను తీసుకొచ్చి బినోద్ సర్దార్ అనే వ్యక్తికి ఇస్తే అతడు చుట్టు పక్కల నివసించే వారికి వాటిని అమ్మాలని ఒప్పందం చేసుకున్నారు. ఆ ప్లాన్ ప్రకారం.. బుధవారం సాయంత్రం ఐదు డబ్బాల్లో 810 గ్రాముల గంజాయి చాక్లెట్లను షర్వాన్‌కుమార్ రాజస్థాన్ నుంచి తీసుకొచ్చి నాదర్‌గుల్ ఇండస్ట్రియల్ ఏరియా టాటా అడ్వాన్స్ సిస్టమ్ దగ్గర బినోద్ సర్దార్‌కు ఇస్తుండగా ఆదిబట్ల పోలీసులు దాడి చేసి వారిని పట్టుకుని.. వారి నుంచి 810 గ్రాముల గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



# అన్నదాత ఆవేదన

తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌కు తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

- రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్దే ఉంటున్నాం
- వర్షాలకు ధాన్యం తడిసి ముద్దయి పోతున్నది
- పదిహేను రోజులైతే విత్తనాలు వేయాలి

**ధాన్యం కొనుగోలు చేయాలంటూ తాండూరు సబ్ కలెక్టర్ ఎదుట గోడు వెళ్లబోసుకున్న రైతులు**

బషీరాబాద్, మే 16 : రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్దే పడిగాపులు కాస్తున్నాం.. వర్షాలకు వడ్లు తడిసి ముద్దై పోతున్నాయి.. పదిహేను రోజులైతే విత్తనాలు వేసే సమయం వస్తుంది.. ఇంకా మా ధాన్యాన్ని ఎవరూ కొంట లేరంటూ రైతులు తాండూరు సబ్‌కలెక్టర్ ఎదుట గోడు వెల్లబోసుకున్నారు. శుక్రవారం తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ కాశీంపూర్, మైల్వార్ కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేయగా.. అక్కడి రైతులు తమ సమస్యలను వివరించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొచ్చి నెల రోజులవుతున్నా.. కాంటానే చేయలేదని.. బస్తాలు ఇవ్వడం లేదన్నారు. మైల్వార్ గ్రామానికి చెందిన ఓ రైతు సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతూ మాకు వేరే దారి లేదు పురుగుల మందు తాగి చనిపోవడం తప్ప అని కన్నీంటి పర్యంతమయ్యాడు. రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం మొత్తం తడిసిపోయింది. ఇప్పుడు దానిని ఎవరూ కొంటారని ధాన్యాన్ని చేతిలో పట్టుకుని సబ్ కలెక్టర్‌కు చూయించాడు. మరో రైతు మాట్లాడుతూ బస్తాకు రెండు, మూడు కిలోలు ఎక్కువగా తూకం చేస్తున్నారని.. ఎవరైనా ప్రశ్నిస్తే.. మీ వడ్లు బాగా లేవని భయాందోళనకు గురి చేస్తున్నారని పేర్కొన్నాడు. స్పందించిన సబ్ కలెక్టర్ నిర్వాహకులతో మాట్లాడుతూ కొనుగోళ్లు ఎందుకు ఆలస్యమవుతున్నదని ప్రశ్నించారు. రైతులను ఎందుకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ రైస్‌మిల్లర్లతో మాట్లాడి తడిసిన ధాన్యాన్ని కూడా కొనేలా చర్యలు తీసుకుంటామని.. వారు కొనుగోలు చేయకపోతే రైస్‌మిల్లులను బ్లాక్ లిస్ట్‌లో పెట్టేలా కలెక్టర్‌తో మాట్లాడుతానన్నారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ వెంకటేశ్ ఉన్నారు.

# అందగత్తెల సందడి



శంకర్‌పల్లి మండలం, ప్రొద్దటూరులోని ఎక్స్‌పీరియం ఎకో ఫ్రెండ్లీ పార్కులో శుక్రవారం ప్రపంచ సుందరాంగులు సందడి చేశారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న 'మిస్ వరల్డ్' పోటీ ల్లో పాల్గొనేందుకు విచ్చేసిన వివిధ దేశాలకు చెందిన అందగత్తెలు ప్రొద్దటూరులో 250 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఎక్స్‌పీరియం ఎకో ఫ్రెండ్లీ పార్కులోని అరుదైన మొక్కలు, వృక్ష జాతులు, శిల్పకళ సంపదను వీక్షించారు. అందమైన ఆకృతుల వద్ద ఫొటోలు దిగి.. సెల్ఫీలు తీసుకున్నారు. పార్కు అద్భుతంగా ఉందని కితాబిచ్చారు.

-చేవెళ్ల రూరల్, మే 16



## కార్యాచరణలో అదే నిర్లక్ష్యం..

వర్షాకాల విపత్తును ఎదుర్కొని ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికలతో సిద్ధం కావాలి. అయితే గతేడాది ఐఆర్టీ బృందాల ఏర్పాటులో తీవ్ర జాప్యం జరిగింది. జూలై వరకు కూడా ఎమర్జెన్సీ బృందాలను సిద్ధం చేయలేదు. ప్రధానంగా ఈ పనులకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు.. పెండింగ్ బకాయిలు రూ. 1400 కోట్లు చెల్లిస్తేనే టెండర్లలో పాల్గొంటామని తేల్చి చెప్పడంతో మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ టెండర్లకు స్పందన లేకపోవడంతో జాప్యం జరిగింది. గత అనుభవాలతోనైనా అధికారులు ఈ ఏడాది ముందస్తుగా కార్యాచరణలోనూ అదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. కాంట్రాక్టర్లు సైతం ఇప్పటి వరకు పెండింగ్ బకాయిల క్లియరెన్స్ చేయలేదని, జూన్ నాటికల్లా రూ.400 కోట్ల మేర బకాయిలు చెల్లిస్తారని చెప్పారే తప్ప ఆ దిశగా ప్రయత్నాలు జరగలేదని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. బకాయిలు వస్తేనే జీహెచ్ఎంసీ చేపట్టబోయే పనులకు ఆసక్తి కనబరుస్తామని సదరు కాంట్రాక్టర్లు చెబుతుండడంతో త్వరలో పిలవబోయే మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ బృందాల ఏర్పాటు పనుల టెండర్లపై స్పందన ఏ విధంగా ఉంటుందన్న దానిపై ఆసక్తికరంగా మారింది.

# ముంపుపై ప్రణాళికేదీ..?

## ముంచుకొస్తున్న అకాల వర్షాలు

- నిర్లక్ష్యం వీడని జీహెచ్ఎంసీ
- ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు వస్తాయన్న సూచనలూ బేఖాతర్
- ప్రతిపాదనల దశలోనే కాలయాపన
- 25లోగా ఖరారు కావాల్సిన మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్
- టెండర్లకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- ఇంజినీరింగ్ విభాగంపై తీవ్ర విమర్శలు

సిటీబ్యూరో, మే 16 (నమస్తే తెలంగాణ ): ఒకవైపు అకాల వర్షాలు..మరోవైపు ముంచుకొస్తున్న ముందస్తు వర్షాలు.. అయినా జీహెచ్ఎంసీ నిర్లక్ష్యాన్ని వీడడం లేదు.. ముందస్తు ప్రణాళికలతో వరద ముంపు లేకుండా చూడాల్సిన అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తున్నది. ఇప్పటికే కొన్ని చోట్ల పడుతున్న అకాల వర్షాలతో మునిగిపోతున్న కాలనీలు, రహదార్లులపై ఏరులై పారుతున్న వరద నీరు..పొంగిపొర్లుతున్న నాలాలు.. వాస్తవంగా ఇప్పటి వరకు మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ ఖరారు కావాల్సి ఉన్నది. ఈ నెల 25 లోగా సర్కిళ్ల వారీగా మాన్‌సూన్ యాక్షన్ బృందాలు వర్షాకాల విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొనేలా సిద్ధం కావాల్సి ఉన్నది. ఇటీవల కమిషనర్ ఆదేశాలు జారీ చేసినా ఇంజినీరింగ్ విభాగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నది.

తీరిగ్గా జోనల్ నుంచి ప్రతిపాదనలను స్వీకరిస్తున్నది. ఈ సారి వర్షాకాలం ముందస్తుగా రాబోతున్నదని వాతావరణ శాఖ సూచించినా ఏ మాత్రం అదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తున్న ఇంజినీరింగ్ నిర్వహణ విభాగంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

### కొరవడిన ముందస్తు ప్రణాళిక..

ఈ నెల చివరి వారం నాటికల్లా మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ అమలుకు పూర్తి స్థాయిలో సిద్ధం కావాల్సిన అధికారులు ప్రతిపాదనలు రూపొందించడంలో తాత్సారం చేస్తున్నారు. ప్రతి ఏటా దాదాపు రూ.33 కోట్లతో మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించి ఇందుకు సంబంధించి పనులకు టెండర్లు పిలవాల్సి ఉంటుంది. ఏరియాల వారీగా 140 బృందాలు, ప్రత్యేక వాహనాలు, స్టాటిక్ లేబర్స్, మినీ మొబైల్ మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలను ఏర్పాటు చేసి వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు ఐఆర్టీ పనులకు ఇప్పటికే టెండర్లు పిలవాల్సిన అధికారులు జాప్యం చేస్తున్నారు. ఇటీవల కమిషనర్ మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ ఖరారు చేయాలని ఆదేశించిన ఇప్పటి వరకు పురోగతి లేకపోవడం ఇంజినీరింగ్ అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది.

మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయడంలో చొరవ తీసుకోవడం లేదు. ఒకవైపు నత్తనడకన నాలా అభివృద్ధి (ఎస్ఎన్‌డీపీ) పనులు, మరో వైపు తూతూ మం త్రంగా నాలా పూడికతీత పనులు జరుగుతుండడం, మరోవైపు మాన్‌సూన్ బృందాల ఏర్పాటులో అదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తున్న ఇంజినీరింగ్ నిర్వహణ విభాగంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.



## జంగోనిగూడలో విద్యుత్తు లైన్ పునరుద్ధరణ

నమస్తే ఎఫెక్ట్

నందిగామ, మే 16 : మండలంలోని జంగోనిగూడ గ్రామంలోని వ్యవసాయ పొలాల్లో ఉన్న విద్యుత్తు వైర్లు ఇటీవల కురిసిన గాలివానకు తెగి ప్రమాదకరంగా మారడంతో.. 'ప్రమాదకరంగా విద్యుత్తు తీగలు' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్తు శాఖ అధికారులు స్పందించారు. శుక్రవారం విద్యుత్తు లైన్‌ను పునరుద్ధరించడంతోపాటు ప్రమాదకంగా ఉన్న వైర్లను సరిచేశారు. ఈ సందర్భంగా ఏఈ శ్రీధర్ మాట్లాడుతూ.. మరి కొన్ని చోట్ల నూతన విద్యుత్తు స్తంభాలు, వైర్లు ఏర్పాటు చేసి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామన్నారు. 'నమస్తే తెలంగాణ'కు విద్యుత్తు శాఖ అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆ వెంచర్లలో మౌలిక వసతులు కల్పించడంలో శ్రద్ధ చూపని రేవంత్ సర్కార్

## హెచ్ఎండీఏ లేఅవుట్లకు

# రాజకీయ గ్రహణం

- భూములు కబ్జా కాకుండా.. ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చేందుకు కోకాపేట, తొర్రూరు, మోకిల, మన్నెగూడ తదితర ప్రాంతాల్లో వెంచర్లను ఏర్పాటు చేసిన గత బీఆర్ఎస్ సర్కార్
- ప్రభుత్వ సంస్థ కావడంతో హాట్ కేకులా అమ్ముడుపోయిన ప్లాట్లు
- రాష్ట్రానికి భారీగా సమకూరిన ఆదాయం
- 15 నెలలు దాటినా సమకూరని మౌలిక వసతులు
- వసతులు కల్పించాలి : ప్లాట్లదారులు



తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మన్నెగూడలో వసతులు లేని హెచ్ఎండీఏ వెంచర్..

### రాష్ట్రానికి భారీగా సమకూరిన ఆదాయం..

జిల్లాలోని మోకిల్లలో 165 ఎకరాలు, కుర్మల్‌గూడలో 16.35 ఎకరాలు, తొర్రూరులో 170, మన్నెగూడలో 16 ఎకరాల్లో ఈ వెంచర్లను హెచ్ఎండీఏ ఏర్పాటు చేయగా.. వేలాది మంది అప్పులు చేసి మరీ ప్లాట్లను కొనుగోలు చేశారు. దీని ద్వారా హెచ్ఎండీఏకు కోట్లాది రూపాయల ఆదాయం సమకూరింది. అయితే, 15 నెలలు గడిచినా ఇప్పటికీ ఆ లేఅవుట్లలో 50 శాతం కూడా మౌలిక వసతులను కల్పించలేదు. ప్లాట్లదారులు ఇండ్లు నిర్మించుకునేందుకు ముందుకొస్తున్నా.. మౌలిక వసతులు లేని కారణంగా పనులను ప్రారంభించడంలేదు.

రంగారెడ్డి, మే 16 (నమస్తే తెలంగాణ) : గత బీఆర్ఎస్ ప్రభుత్వం హెచ్ఎండీఏ పరిధిలోని భూములు అన్యాక్రాంతం కాకుండా నిలువరించేందుకు, అదేవిధంగా ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చేందుకు జిల్లా శివారు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హెచ్ఎండీఏ లేఅవుట్లను ఏర్పాటు చేసింది. ఈ వెంచర్లలో అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో ప్రజలు పోటీపడి మరీ ప్లాట్లను కొన్నారు. అయితే.. అసెంబ్లీ ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారడంతో ఆ లేవుట్లపై ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ శీతకన్ను చూపుతున్నదన్న ఆరోపణలున్నాయి. జిల్లాలోని కోకాపేట, తొర్రూరు, మోకిల, మన్నెగూడ తదితర ప్రాంతాల్లో గత బీఆర్ఎస్ హయాంలో పెద్ద ఎత్తున వెంచర్లను ఏర్పాటు చేశారు. అవి హెచ్ఎండీఏ వేసిన వెంచర్లు కావడం, టైటిల్ క్లియర్‌గా ఉండడం.. ఆ ప్లాట్లలో తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు, పార్కులు, ఆటస్థలాలు వంటివి ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో ఆ ప్లాట్లు హాట్‌కేక్‌లా అమ్ముడు పోయాయి. అయితే, ప్రభుత్వం మారడంతో ఈ వెంచర్ల అభివృద్ధిపై రేవంత్ సర్కార్ చిన్నచూపు చూస్తున్నదన్న ఆరోపణలున్నాయి.

హెచ్ఎండీఏ నియమ నిబంధనల ప్రకారం 18 నెలల్లోనే ఆయా లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పించాలి. విద్యుత్ సౌకర్యం, రహదారులు వంటి వాటిని ఏర్పాటు చేయాలి. లేఅవుట్లను వేలం వేసినప్పుడే హెచ్ఎండీఏ అధికారులు ఈ కాల పరిమితిలో అన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కానీ, ఏడాది గడిచినా ఇప్పటికీ మౌలిక వసతుల కల్పనపై ప్రస్తుత సర్కార్ దృష్టి సారించడంలేదు. దీంతో ప్లాట్లదారులు త్వరగా వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



# రెండు నెలల కోటా స్వాహా..!

- వికారాబాద్ జిల్లాలో పేదల కడుపు కొడుతున్న కొందరు రేషన్ డీలర్లు
- రేషన్ కార్డుదారులకు సమాచారం లేక అదనపు కోటా బియ్యాన్ని అమ్ముకుంటున్న పలువురు డీలర్లు

వికారాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని కొందరు రేషన్ డీలర్లు పేదల కడుపు కొడుతున్నారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డులు ఇస్తామని హామీనిచ్చిన కాంగ్రెస్ పార్టీ.. 12 నెలల తర్వాత కొత్త కార్డులను జారీ చేసింది. అయితే, ప్రభుత్వం కొత్త కోటా బియ్యాన్ని పంపిణీ చేయగా జిల్లాలోని పలువురు డీలర్లు దానిని పక్కదారి పట్టిస్తున్నారు. కొత్త లబ్ధిదారులకు చెందిన రెండు నెలల బియ్యం కోటాను బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారు. కొత్త రేషన్ కార్డుదారులకు కోటా రిలీజ్ అయిన సమాచారాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇదే అదునుగా భావించిన కొందరు డీలర్లు అదనంగా వచ్చిన బియ్యం కోటాను స్వాహా చేస్తున్నారు. అయితే, గతంలో ప్రతినెలా 5,600 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని జిల్లాలో పంపిణీ చేయగా.. కొత్త రేషన్‌కార్డులతో పాటు కొత్తగా చేర్చిన యూనిట్లతో జిల్లాకు సరఫరా అయ్యే బియ్యం కోటా 5,780 మెట్రిక్ టన్నులకు పెరిగింది. గతంతో పోలిస్తే 180 మెట్రిక్ టన్నుల బియ్యం జిల్లాకు వచ్చే కోటాకు అదనంగా చేరింది. రెండు నెలలకు సంబంధించి 360 మెట్రిక్ టన్నుల వరకు బియ్యం అదనంగా జిల్లాకు సరఫరా కాగా, సంబంధిత అదనపు కోటాలో దాదాపు 200 మెట్రిక్ టన్నుల వరకు రేషన్ డీలర్లు పేదలకు పంపిణీ చేయకుండా దారి మళ్లించినట్లు సమాచారం.

### పౌరసరఫరాల అధికారుల నిర్లక్ష్యం..

జిల్లాలో కొత్తగా జారీ అయిన రేషన్ కార్డులతో పాటు కొత్తగా యాడ్ అయిన యూనిట్లకు సంబంధించి గతనెల నుంచి రేషన్ బియ్యం కోటాను ప్రభుత్వం రిలీజ్ చేసింది. జిల్లాలో గతంలో 2,46,000 రేషన్‌కార్డులుండగా 8,44,000 మంది లబ్ధిదారులున్నారు. కొత్తగా మంజూరైన రేషన్ కార్డులతోపాటు కొత్తగా చేరిన సభ్యులతో జిల్లాలో రేషన్‌కార్డుల సంఖ్య 2,48,475కు చేరగా, 8,87, 912 మంది లబ్ధిదారులున్నారు. వాటిలో అంత్యోదయ కార్డులు 26,621 ఉండగా.. లబ్ధిదారులు 79,524 మంది, అన్నపూర్ణ కార్డుదారులు 41 మంది, ఆహార భద్రతాకార్డులు 2,21,818 ఉండగా.. లబ్ధిదారులు 8,08, 347 మంది ఉన్నారు. అయితే, గతంతో పోలిస్తే జిల్లాలో 2,000 కార్డులు కొత్తగా జారీ కాగా, 40,000 యూనిట్లు పెరిగాయి. కొత్తగా జారీ అయిన లబ్ధిదారులకు రిలీజ్ అయ్యే కోటాకు సంబంధించి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం. కాగా, కొందరు రేషన్ డీలర్లు నిజాయితీగా కొత్త రేషన్‌కార్డులతోపాటు యాడ్ అయిన యూనిట్లను కలిపి రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయగా.. చాలామంది డీలర్లు కొత్త రేషన్‌కార్డులతోపాటు యాడ్ అయిన యూనిట్ల లబ్ధిదారులకు సమాచారం ఇవ్వకుండానే రెండు నెలలకు సంబంధించిన కోటాను స్వాహా చేసినట్లు తెలిసింది. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే రేషన్ డీలర్లు పేదలకు పంపిణీ చేయాల్సిన సన్న బియ్యాన్ని స్వాహా చేశారన్న ఆరోపణలున్నాయి. ఈ నెల కోటాకు సంబంధించి గత వారం, పది రోజులుగా బియ్యాన్ని పంపిణీ చేస్తున్న దృష్ట్యా రేషన్ అదనపు కోటా రిలీజ్ అయిన సమాచారాన్ని ప్రజలకు తెలియజేయాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

### రేషన్ బియ్యాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు

రేషన్ బియ్యాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అదేవిధంగా ప్రతి రేషన్ షాపులోనూ కొత్తగా వచ్చిన లబ్ధిదారుల వివరాలు డిస్ ప్లే చేసేలా సంబంధిత అధికారులను ఆదేశిస్తాం. ఎక్కడైనా రేషన్ బియ్యం పక్కదారి పట్టినట్టు తెలిస్తే ప్రజలు సమాచారం ఇవ్వాలి.

-లింగ్యానాయక్, వికారాబాద్ అదనపు కలెక్టర్